బడ్జెట్ ముచ్చట్లు



తెలంగాణ ప్రభుత్వం బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌పై వివిధ పార్టీలు, ప్రజా సంఘాలు పెదవి విరిచాయి. ఇది ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చే బడ్జెట్ కాదని కొందరు.. ఆరు గ్యారంటీల అమలును ఈ బడ్జెట్ నిర్లక్ష్యం చేసిందని మరికొందరు. ఇలా ఒక్కొక్కరు ఒక్కోలా స్పందించారు. రాష్ట్ర బడ్జెట్‌పై ఎవరేమన్నారో చూద్దాం..

ముషీరాబాద్/అంబర్‌పేట జోన్ బృందం

ఢిల్లీకి మూటలు పంపే బడ్జెట్..



బడ్జెట్‌లో ప్రతి రంగానికి, ప్రతి వర్గానికి కాంగ్రెస్ ప్రభుత్వం వెన్నుపోటు పొడిచింది. ఆరు గ్యారంటీలతో పాటు ఎన్నికల హామీలకు మంగళం పాడింది. ఇచ్చిన మాటకు కాకుండా ఢిల్లీకి మూటలు పంపడం పైనే దృష్టిని కేంద్రీకరించినట్లు ఈ బడ్జెట్ చెబుతోంది. ప్రజాధనాన్ని పార్టీకి పంచిపెట్టే కుట్ర కనిపిస్తోంది. ఆటో డ్రైవర్ల నుంచి అన్నదాత వరకు అందరినీ మోసం చేసింది. మహిళలు, వృద్ధులకు ఇచ్చిన హామీలపై ప్రస్తావన లేదు.

– ముఠాగోపాల్, ఎమ్మెల్యే ముషీరాబాద్

నగరాభివృద్ధికి మొండిచేయి



రాష్ట్ర బడ్జెట్‌లో రైతులు, మహిళల సంక్షేమాన్ని ప్రభుత్వం పట్టించుకోలేదనేది స్పష్టమయ్యింది. మహాలక్ష్మి పథకం, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు హామీలన్నీ విస్మరించింది. నగరాభివృద్ధికి మొండిచేయి చూపించింది. ఈ బడ్జెట్‌ప్రజల కష్టాలను తీర్చేలా లేదు. కమీషన్ల కోసం ఢిల్లీకి మూటలు పంపేలా ఉంది.

– పావని, గాంధీనగర్ కార్పొరేటర్

మహిళా సంక్షేమాన్ని విస్మరించింది.



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మహిళా సంక్షేమాన్ని విస్మరించడం సరికాదు. ప్రజా ప్రభుత్వమని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆ దిశగా వెళ్లడం లేదు. మహిళల అభివృద్ధి, సంక్షేమానికి బడ్జెట్ కేటాయించకపోవడం మహిళలను విస్మరించడమే. ప్రజా క్షేత్రంలో కాంగ్రెస్‌ను నిలదీస్తాం.

– జి.రచనశ్రీ, కవాడిగూడ కార్పొరేటర్

విద్యారంగం తీవ్ర నిర్లక్ష్యం..



రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 23 వేల 108 కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించారు. కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో 15 శాతం నిధులు కేటాయిస్తామని చెప్పడంతో పాటు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ గురించి గొప్పగా ప్రస్తావించింది. వారు నెలకొల్పబోయే 58 స్కూల్స్ నిర్మాణానికి రూ.11,600 కోట్లు కేటాయించింది. సంక్షోభంలో ఉన్న ఉన్నత విద్య, విద్యార్థుల బాగోగుల గురించి మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉంది. విశ్వవిద్యాలయాల పేర్లు మార్చడమే పెద్ద అభివృద్ధిగా ప్రభుత్వం భావిస్తోంది.

– నాగరాజు, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు

బడ్జెట్‌లో గ్రేటర్‌కు మొండిచేయి



కాంగ్రెస్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోంది. రాష్ట్రానికి దాదాపు 65 శాతం నిధులు కేవలం గ్రేటర్ హైదరాబాద్ నుంచే వస్తోందన్నారు. కానీ గ్రేటర్‌కు నిధులు పెంచకుండా మొండిచేయి చూపించింది. నగర అభివృద్ధికి పెద్ద మొత్తంలో నిధులు ఎందుకు కేటాయించలేదో చెప్పాలి. గ్రేటర్ అభివృద్ధిని పట్టించుకోకపోతే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో నగర ప్రజలే తగిన బుద్ధి చెబుతారు.

– బీజేపీ సీనియర్ నేత డా. గౌతంరావు

మాట నిలుపుకునే విధంగా బడ్జెట్



రాహుల్ గాంధీ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన మాట నిలుపుకునే విధంగా రాష్ట్ర బడ్జెట్ ఉంది. ఇందులో ముఖ్యంగా బీసీలకు రూ.11,405 కోట్లు, ఎస్సీలకు రూ. 40,232 కోట్లు కేటాయించడం హర్షణీయం. ఇందుకు కృతజ్ఞతగా బీసీల తరపున ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్య మంత్రి బట్టి విక్రమార్కలకు ధన్యవాదాలు.

– జేబీ మురళీకృష్ణ, బీసీ జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు

ఆరు గ్యారంటీల ఊసేదీ



ఆరు గ్యారంటీల అమలుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం ప్రజలను మోసం చేయడమే. అధికారంలోకి రాకముందుకు ఒక మాట, అధికారంలోకి వచ్చాక మరో మాట కాంగ్రెస్ పార్టీకే చెల్లింది. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ మోసాలను గమనించాలి.

– ఎంసీ మహేందర్‌బాబు, బీజేపీ నగర నాయకులు

పది విజయానికి.. పన్నెండు సూత్రాలు



టెన్త్ విద్యార్థులు ఇవి పాటించాలి

విద్యార్థి జీవితంలో కీలకమైన పదో తరగతి పరీక్షలు ఈనెల 21వ తేదీన ప్రారంభమై ఏప్రిల్ 4వ తేదీ వరకు జరుగనున్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం పరీక్షలు జరుగుతాయి. విద్యార్థులకు హాల్ టికెట్ల పంపిణీ పూర్తయ్యింది. పరీక్షల గడువు దగ్గర పడుతున్నా కొద్దీ విద్యార్థుల్లో భయం, ఆందోళన పెరిగిపోతోంది. విద్యార్థుల తల్లిదండ్రుల్లో అయితే ఆందోళన మరింత ఎక్కువగా కనిపిస్తోంది. ఏకాగ్రత, నిరంతర సాధన, గుండెల నిండా ధైర్యం, నమ్మకమే విజయతీరాలకు చేర్చుతుందని విద్యావేత్తలు సూచిస్తున్నారు. ప్రతి విద్యార్థి పదో తరగతిలో విజయ కేతనం ఎగురవేయడానికి ఈ పన్నెండు సూత్రాలు పాటించాలని సూచిస్తున్నారు. అవి ఏవో చూద్దాం..

– నల్లకుంట

పునశ్చరణకే ప్రాధాన్యం..



పరీక్షల సమయంలో కొత్తవి చదివేకన్నా పునశ్చరణకే ప్రాధాన్యం ఇవ్వాలి. పరీక్ష రోజున వేకువజామున లేచి కొంత సమయం ముఖ్యమైన ప్రశ్నలు ఒకసారి మననం చేసుకుంటూ చదివితే మంచిది. పరీక్ష పేపరులో అక్షరాలు పొందికగా, పెద్దగా, చూడముచ్చటగా ఉండాలి. ఇంగ్లిషులో గ్రామర్, సోషల్‌లో మ్యాప్‌లు బాగా ప్రాక్టీస్ చేయండి. పరీక్షల సమయంలో సెల్‌ఫోన్‌కు విశ్రాంతి ఇవ్వడం మరిచిపోవద్దు.

– వివేక్ చంద్ర, ఇంగ్లిష్ నిపుణులు

భయం వద్దు..

అనవసర భయాల వల్ల ఆందోళన పెరుగుతుంది. పరీక్షలపై దృష్టిపెట్టి, ఆయా సబ్జెక్టుల్లో నిరంతర సాధన చేయాలి. విద్యార్థులు ప్రతి రోజు పది నిమిషాల పాటు ధ్యానం లేదా పూజ చేయడం మంచిది.

సందేహమెందుకు?

చదివిన ప్రశ్నలు రాకపోతే చదివింది గుర్తుకు రాకపోతే లాంటి ఆలోచనలు దరిచేరనీయొద్దు.

ప్రణాళిక ముఖ్యం..

ఎంత చదివామన్నది ముఖ్యం కాదు. ప్రణాళికతో ఎలా చదివామన్నది ముఖ్యం.

జాగ్రత్త అవసరం..

చదువు ధ్యాసలో పడి ఆహారాన్ని నిర్లక్ష్యం చేయడం మంచిది కాదు. వేళకు తేలికపాటి, బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలి. పండ్ల రసాలు, కొబ్బరి బోండం నీరు, మజ్జిగ వంటివి ఎక్కువగా తీసుకోవాలి.

మంచి నిద్రమేలు..

విద్యార్థులకు సరైన నిద్ర అవసరం. పరీక్షల సమయంలో అర్ధ రాత్రి దాటే వరకు చదవడం వల్ల ఉపయోగం ఉండదు. రాత్రి 10గంటలకు పడుకుని, వేకువజామునే లేచి చదివితే మంచిది.

కొత్త విషయాల జోలికి వద్దు..

పరీక్షల సమయంలో కొత్త విషయాలు నేర్చుకోవాలనే ప్రయత్నం చేయొద్దు. ఈ సమయంలో కేవలం రివిజన్ మాత్రమే చేయాలి. ఇది వరకు చదవని ప్రశ్నలు మరీ ముఖ్యమైతే తప్ప నేర్చుకునే ప్రయత్నం చేయొద్దు.

సెల్ ఫోన్లకు దూరం..

పరీక్షల సమయంలో సెల్‌ఫోన్ ముచ్చట్లు, ఫ్రెండ్స్‌తో చర్చలు అనవసరం.

ముందుగా వెళ్లడం శ్రేయస్కరం..

పరీక్షకు అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరండి. దారి ప్రయాణంలో చదవడం పరీక్షకు వెళ్లే ముందు ఓసారి పుస్తకం తీసి చూడాలన్న ఆలోచన వద్దు.

తెలిసిన ప్రశ్నలకు ముందు ప్రాధాన్యం ఇవ్వండి..

బాగా తెలిసిన ప్రశ్నలకు ముందుగా జవాబులు రాయండి. సాధ్యమైనంత వరకూ దిద్దుబాటు లేకుండా చూడండి. టైం పూర్తయ్యే వరకూ పరీక్షా హాలు వదిలి రాకండి. హాల్ టికెట్ నంబరు, ప్రశ్నల నంబర్లు ఒకటికి రెండు సార్లు సరిచూసుకోవడం మంచిది.

ఇతరులను పట్టించుకోకండి..

పరీక్షలు రాసే సమయంలో పక్కకి చూడవద్దు. ఎవరు ఎన్ని ఎడిషన్ షీట్లు తీసుకుంటున్నారనేది పట్టించుకోవద్దు. అది మీలో తెలియని ఆందోళనను పెంచుతుంది.

విసుక్కోవద్దు.. పోల్చుకోవద్దు

తల్లిదండ్రులు పిల్లలను విసుక్కోవడం, చదవడం లేదని తిట్టడం వంటివి చేయొద్దు. పరీక్షలు రాస్తున్న పిల్లలను ఫంక్షన్లు వంటి ఇతర కార్యక్రమాలకు తీసుకెళ్లడం మంచిదికాదు. ముఖ్యంగా ఇతర విద్యార్థులతో మీ పిల్లలను అస్సలు పోల్చవద్దు.

ప్రశాంతంగా ఉండండి..

మామూలు రోజుల్లో ఎలా ఉంటారో పరీక్షల సమయంలో కూడా అలాగే ప్రశాంతంగా ఉండండి. పరీక్ష రాసిన వెంటనే ఇంటికి రావడం మంచిది. ఫలానా ప్రశ్నకు సమాధానం సరైనదేనా కాదా అంటూ స్నేహితులతో చర్చ పెడితే ఒకరు రైట్ అని, మరొకరు రాంగ్ అని చెబితే మీరు పూర్తిగా కన్ఫ్యూజన్‌లోకి వెళ్లిపోయి మరుసటి రోజు పరీక్షపై అనవసర భయం ఏర్పడుతుంది.

తేలికగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోండి..



పరీక్షకు వెళ్లడానికి 2 గంటల ముందు కొబ్బరి నీళ్లు తాగాలి. తేనె, నిమ్మరసం, వేడి గంజి వంటివాటిలో ఏదైనా తీసుకోవడం మంచిదే. బయటి ఆహారం, ఫాస్ట్‌ఫుడ్స్ వాటికి దూరంగా ఉండాలి. తేలికగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవడం మంచిది. మొలకలు, క్యారెట్, కీరదోస వంటివి తీసుకోవడం వల్ల మేలు కలుగుతుంది. ఇవి శరీరానికి నూతన ఉత్తేజాన్ని ఇస్తాయి.

– డాక్టర్ ఎ. జయలక్ష్మి, ఫీవర్ ఆసుపత్రి సీఎస్ ఆర్ఎంవో

మనోధైర్యంతో పరీక్షలకు సన్నద్ధం కావాలి



అంబేడ్కర్ పాఠశాలలో మాట్లాడుతున్న డాక్టర్ విష్ణుప్రియా తదితరులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: పదో తరగతి విద్యార్థులు మనోధైర్యంతో పరీక్షలకు సన్నద్ధం కావాలని అంబేడ్కర్ కళాశాలల డైరెక్టర్ డాక్టర్ విష్ణుప్రియా అన్నారు. బుధవారం పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం వారికి హాల్ టికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రణాళికబద్ధంగా విద్యను అభ్యసిస్తే అపజయం అంటూ ఏది ఉండదన్నారు. పట్టుదల క్రమశిక్షణ ఉంటే మంచి ఫలితాలు వస్తాయని సూచించారు. నిరాశకు గురికాకుండా ఆశాజనకంగా చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఒత్తిడికి లోను కాకుండా పరీక్షలు రాయాలి

ట్రస్మా రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్ఎన్ రెడ్డి



కవాడిగూడ: పదో తరగతి పరీక్షలకు సన్నద్ధం అవుతున్న విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా ఉత్తమ ఫలితాలను సాధించాలని తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్ఎన్ రెడ్డి అన్నారు. బుధవారం దోమలగూడలోని రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థి తన పాఠశాలలో ఏ విధంగా అయితే పరీక్షలు రాస్తారో అదే విధంగా ప్రధాన పరీక్షను రాయాలన్నారు. ఎలాంటి ఆందోళన లేకుండా ప్రశాంతంగా ఉండాలన్నారు. ఉపాధ్యాయులు చెప్పే సూచనలు పాటించాలని సూచించారు. పరీక్షలు రాసే విద్యార్థులకు ఈ సందర్భంగా ఆయన ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా ప్రధాన కార్యదర్శి కె. అనిల్‌కుమార్, కోశాధికారి కె. శ్రీకాంత్ రెడ్డి, వ్యవస్థాపక అధ్యక్షుడు కె. పాపిరెడ్డి, ముఖ్య సలహాదారులు కె.అనంతరెడ్డి, అధికార ప్రతినిధి సి.రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

మల్లు స్వరాజ్యం స్ఫూర్తిని భావితరాలకు అందించాలి



మల్లు స్వరాజ్యం వర్ధంతి సభలో మాట్లాడుతున్న పంచాయితీరాజ్ శాఖ మంత్రి సీతక్క

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం జీవిత చరిత్రను భావితరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పంచాయితీరాజ్ శాఖ మంత్రి డాక్టర్ ధనసిరి అనసూయ (సీతక్క) అన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఐద్వా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మల్లు స్వరాజ్యం 3వ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి సీతక్క మాట్లాడుతూ... భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం ఎంతగానో పోరాటం చేశారన్నారు. భూమి కోసం పోరాడిన చాకలి ఐలమ్మ పేరును కోఠి ఉమెన్స్ కాలేజీకు తమ ప్రభుత్వం పెట్టిందన్నారు. మల్లు స్వరాజ్యం ఉన్నతమైన కుటుంబంలో పుట్టి వందలాది ఎకరాల భూములు ఉన్నప్పటికీ పేదల పక్షాణ పోరాడిన వీర వనిత అని కొనియాడారు. ఆమె దళ కమాండర్‌గా పనిచేసినప్పటికీ ఎన్నికల పంథాలో ఎమ్మెల్యేగా గెలుపొందారని గుర్తుచేశారు. తన జీవితంలో కూడా అదే కొనసాగుతుందని ఆమె స్ఫూర్తితో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. మల్లు స్వరాజ్యం ట్రస్ట్ ఏర్పాటు కోసం 2 ఎకరాల భూమి, ఆమె విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలన్న ఐద్వా నాయకుల విన్నపాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్ అరుణజ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, ప్రముఖ సినీ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, ఐద్వా నాయకులు టి. జ్యోతి, అరోణోదయ సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క, పీవోడబ్ల్యూ జాతీయ అధ్యక్షురాలు వి. సంధ్య, రాష్ట్ర అధ్యక్షురాలు అనసూయ, బి. స్వరూప తదితరులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీని తెలంగాణ జాతిపితగా ప్రకటించాలి

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీని తెలంగాణ జాతిపితగా ప్రకటించాలని అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన గొప్ప వ్యక్తి లక్ష్మణ్‌బాపూజీ అని అన్నారు. తెలంగాణ తొలిదశ, మలిదశ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారన్నారు. తెలంగాణ రాష్ట్రం సాధించే వరకు ఎలాంటి పదవులు తీసుకోనని ఉన్న పదవులను వదులుకున్న గొప్ప నాయకుడు బాపూజీ అని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి తన ఆస్తులను అప్పగించి సాధారణ జీవితాన్ని గడిపిన గొప్ప వ్యక్తి అని అన్నారు. ఆయన తెలంగాణకు అందించిన సేవలను గుర్తించి బాపూజీని తెలంగాణ జాతిపితగా ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, కోశాధికారి కొక్కుల దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో మాట్లాడుతున్న కందగట్ల స్వామి

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బొంద పెడతాం

● వడ్లమూరి కృష్ణస్వరూప్

కవాడిగూడ: ఎస్సీలను ఏ,బీ,సీ,డీలుగా వర్గీకరించి మాల సామాజిక వర్గానికి తీవ్ర అన్యాయం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తెలంగాణలో బొందపెడతామని మాల మహానాడు జాతీయ గౌరవ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ అన్నారు. బుధవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్సీ వర్గీకరణ తీర్మాన ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా వడ్లమూరి కృష్ణస్వరూప్ మాట్లాడుతూ... ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇచ్చిన అన్ని రాజకీయ పార్టీలపైన తిరుగుబాటు చేయడానికి మాల ఉపకులాలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఎస్సీ కులాల జనాభా లెక్కలు లేవని 2011 జనాభా లెక్కలు ఆధారంగా ఎస్సీ వర్గీకరణ చేయడం రాజకీయ కుట్రనేనని విమర్శించారు. ఈ అంశంపై ఉన్నత న్యాయస్థానాలలో సవాల్ చేసి ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని అడ్డుకుంటామని తెలిపారు.

- మాలల పక్షాన చట్టసభల్లో గొంతు వినిపించాల్సిన మాల మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వివేక్ వెంకటస్వామి నాయకత్వంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి హోల్‌సేల్‌గా అమ్ముడుపోయారని ఆరోపించారు. మాల సామాజికవర్గానికి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పబ్బతి శ్రీకృష్ణ, జాతీయ ప్రధాన కార్యదర్శి సంపు శ్రీనివాస్, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్, ఎస్సీ, ఎస్టీ, అడ్వకేట్ ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దిల రాయప్ప, నాయకులు బండి ఈశ్వర్, డి.శ్రీనివాస్, సీహెచ్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



లోయర్ ట్యాంక్‌బండ్‌లోఎస్సీ వర్గీకరణ ప్రతులను దహనం చేస్తున్న మాల మహానాడు నేతలు

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ

ముషీరాబాద్: విద్యార్థులు క్రమ శిక్షణతో చదివినప్పుడే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని రిటైర్డ్ లెక్చరర్ కమలా దేశ్‌పాండే అన్నారు. బుధవారం ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు ఏవీ నాగనాథ్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి ఉన్నత చదువులకు పునాది లాంటిదన్నారు. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకుంటే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ ఐవోఎస్ స్వరూపారాణి, ఇన్‌చార్జి హెచ్ఎం నరేందర్‌యాదవ్, ఉపాధ్యాయులు అన్నపూర్ణ, జయభారతి, నిర్వహకులు ఇందిరా, శ్రేయశ్రీ, ఆలేఖ్య, సునీల్ తదితరులున్నారు.

అన్ని వర్గాల సంక్షేమానికి కృషి

చిక్కడపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తోందని పార్టీ నేత బింగి సాయి కీర్త్(బాబ్జీ) అన్నారు. బీసీ రిజర్వేషన్ల అమలు, ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలపడం హర్షణీయమని అన్నారు. ఈ సందర్భంగా గాంధీ నగర్‌లోని డివిజన్‌లోని న్యూ బ్రిడ్జి వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు గుర్రం శంకర్, సుంకిశాల రాజు, విక్కీ, మారిశెట్టి నర్సింగరావు, రమేష్, గుండు జగదీష్‌బాబు, మనోజ్, గిరి, నవీన్, దోనేటి బానుచందర్, దేవి ప్రసాద్ పాల్గొన్నారు.

మందకృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం

ముషీరాబాద్: ఎస్సీ వర్గీకరణ బిల్లు చట్టబద్ధత కోసం ఆమోదం పొందిన సందర్భంగా రోషన్ వినాయకరావు మాదిగ ఆధ్వర్యంలో రాంనగర్ చౌరస్తాలో మందకృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు గండి కృష్ణమాదిగ, నియోజకవర్గ ఇన్‌చార్జి రాజశేఖర్‌మాదిగ హాజరై మాట్లాడారు. మాదిగ అమరవీరుల త్యాగాలు, మందకృష్ణ సుదీర్ఘ అలుపెరుగని పోరాట ఫలితంతోనే ఎస్సీ వర్గీకరణకు ఆమోదం లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో చిలక ఎల్లయ్యమాదిగ, రాములుమాదిగ, గోపిమాదిగ, నర్సింగ్‌రావు మాదిగ, దశరథ్‌మాదిగ, మీసాల శంకర్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నంకు కృతజ్ఞతలు



సుందరయ్యవిజ్ఞాన కేంద్రం: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీలో రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతులమీదుగా ప్రవేశపెట్టడాన్ని హర్షిస్తున్నామని తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజుగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్‌కుమార్‌గౌడ్ బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి శాలువాతో సన్మానించారు.

సేవా కార్యక్రమాలలో యువత ముందుండాలి



రక్తదానం చేస్తున్న యువకుడితో మాట్లాడుతున్న సినీహీరో మాదాల రవి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: యువత సేవా కార్యక్రమాలలో ముందుండాలని సినీ హీరో డాక్టర్ మాదాల రవి అన్నారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం మాదాల రవి మాట్లాడుతూ.. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లు బ్రిటీష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం చేశారన్నారు. భారత స్వాతంత్ర్యం కోసం 23 ఏళ్ల వయసులోనే తమ ప్రాణాలను అర్పించారని అన్నారు. నేటి యువత వారి స్ఫూర్తితో తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వీకే కార్యదర్శి వినయ్‌కుమార్, డాక్టర్ విజయేందర్, డీవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, ఆనగంటి వెంకటేష్, డాక్టర్ మాధవి, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు లెనిన్, అశోక్‌రెడ్డి, జావేద్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ కళాకారుల బతుకుల్లో వెలుగులు నింపండి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అన్నోజు వెంకటేష్

కాచిగూడ: తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారులకు ఉద్యోగాలు కల్పించి ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అన్నోజు వెంకటేష్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ కేసీఆర్ ప్రభుత్వం తమకు పూర్తిగా అన్యాయం చేసిందని ఆరోపించారు. రసమయి బాలకిషన్ మమ్మల్ని ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని విమర్శించారు. వందలాది మంది కళాకారుల బతుకులు చిన్నాభిన్నమై ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక అర్ధాకలితో బతుకు బండిని నడిపిస్తున్నామని అన్నారు. ఉద్యమ కళాకారులను ఆదుకుంటామని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. తెలంగాణ సాంస్కృతిక సారథిలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. ఉద్యమ కళాకారుల బతుకుల్లో వెలుగులు నింపాలన్నారు. ఈ కార్యక్రమంలో నకిరేకంటి కిరణ్ కుమార్, జువ్వాజి ప్రవీణ్ కుమార్, పేరాల యాదగిరి, డాక్టర్ సలీం, నకరికంటి చిరంజీవి, పున్న రమేష్, రాజేష్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించాలని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ద డెఫ్ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్, ఉపాధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... బీసీ రిజర్వేషన్ బిల్లును ఆమోదించడం హర్షణీయమని అన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించిన ప్రభుత్వం దివ్యాంగులను విస్మరించడం సరికాదన్నారు. అంతే కాకుండా జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయిపాపన్న గౌడ్ పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్ఏ ఉద్దీన్, అబ్దుల్ ఖరీం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతాం

● మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డా. కొండా దేవయ్యపటేల్

కాచిగూడ: తెలంగాణలో అత్యధిక జనాభా కల్గిన మున్నూరుకాపు సామాజికవర్గాన్ని పూర్తిగా విస్మరించిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పేందుకు సంఘటితం కావాలని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండా దేవయ్య పిలుపునిచ్చారు. బుధవారం బర్కత్‌పురలోని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణలోని 33 జిల్లాల మున్నూరుకాపు సంఘాల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించి తగు నిర్ణయాలు తీసుకుని తీర్మానాలు చేశారు. త్వరలోనే నగరంలో 10 లక్షల మందితో 'మున్నూరుకాపుల సింహగర్జన'పేరుతో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. సమాజంలో బలమైన సామాజికవర్గంగా ఉన్న మున్నూరుకాపులకు రాష్ట్ర మంత్రివర్గంలో ఒక్క మంత్రి పదవి కూడా కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ప్రభుత్వ నామినేటెడ్ పదవులు కూడా ఇవ్వలేదన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఆర్‌పీ మహేందర్ కుమార్, ప్రధానకార్యదర్శి జేవీఆర్, చందు జనార్దన్, కొత్త లక్ష్మణ్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో అభివాదం చేస్తున్న కుల సంఘాల ప్రతినిధులు